# ఇదీ - కథ

"ఏంమామా! యీ నెల అంతా మనకు అఖండ రాజయోగం. జన్మలగ్నానికి ఫలితం శత్రునాశనం అని కూడా అన్నాడండోయ్! ఇదుగో, వెళ్ళి, ఆ...కొడుకున్నాడే, వాడితో 'ఖబడ్దార్' నీ గుండెల్లో నిద్రపోతా'నని చెప్పివస్తా - శుభం---"

రోజూ, నాకు ఆ పనస వినడం అలవాటైపోయింది. కాని అప్పుడే రైలు దిగివచ్చిన ఆ స్నేహితుడికి అందులో వున్న గుండెకోత ఏం తెలుస్తుంది? 'ఏమిటి ఆ వాలకం, ఎవరు ఆ మనిషి, ఏమిటి ఆ మాటలకు అర్థం?' అనుకుని తెల్లపోతూ, ఏమీ అడగలేక, ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

అతన్ని సముదాయించటానికని, మళ్ళా ఓ మారు ఆ కథ అంతా ఏకరువు పెట్టాలి--

--పాపం, అతడు చాలా మంచివాడోయ్, నోట్లో నాలుకలేనంతటి అమాయకుడు. నలుగురికీ తలలో నాలుకలాగా మెలగుతూ, ఒక జోలీ శొంఠీ అక్కరలేకుండా, పదిమంది సంపన్న గృహస్థుల యిళ్ళల్లో పౌరోహిత్యం చేసుకుంటూ, నాలుగు డబ్బులు కూడవేసుకుంటూ, ఓ యింటివాడై యింటిపట్టున సుఖంగా కాలక్షేపం చేస్తూండేవాడు.

--నిజంగా అవసరం ఏమీలేదు సుమా? అదివరకు ఎన్నడూ అలాటి వెర్రిమొర్రి సమ్మకాలు ఉన్నాయో, లేవో కూడాను. కుదిచికూర్చుని ఊరక ఉండలేనట్టుగా, రామన్న ఊళ్ళోకి ఎవడో కొత్త జోష్ దిగేటప్పటికి, తన జాతకం చూపించుకున్నాడు: అక్కడితో మునిగింది.

ఆ అప్రాచ్యుడు - వాడెవడో బిళ్ళకుడుముల్లాగా రెండు రూపాయలు చేతులో వేయించుకుని -- ద్వికళత్ర యోగం ఉన్నదని చెప్పాడు. రామన్న నిలువునా నీళ్ళు కారిపోడూ!

ఇక, అక్కడనుంచీ చూసుకో, కాలుకాలిన పిల్లిలాగా, తందనాలు తొక్కడం మొదలు! పోనీ ఎవరితోనైనా మనసువిప్పి, 'ఇలాటి ఆపద వచ్చేట్టుంది. ఏమిటి ఉపాయం?' అని అడిగినా బాగుండిపోను, రండాగర్భంచేసి కప్పి పెట్టాడు. నాలుక దాటిందంటే నాలుగు వాడలూ దాటి, తన యిల్లాలి చెవిని ఎక్కడ పడుతుందో, ఆ వార్త వినగానే ఆ అమ్మాయి అప్పుడే గుటుక్కుమంటుందేమోనని, నోరునొక్కుకుని - సొంతవైద్యం మొదలుపెట్టాడు.

హరిః ఓం అంటూ ఆదిలోనే పెద్ద హంసపాదు వచ్చింది. సిసలైన శ్రోత్రియుడు, పరాయి ఆడదానికేసి కన్నెత్తి చూడటమన్నా అలవాటు లేనివాడు, చూస్తూ చూస్తూ ఒక్కసారిగా, - ఎంత తెగించినా - గంగలో ఎలా ఉరుకుతాడు?

అందువల్ల, నాలుగురోజులు నానామారాముళ్ళూపడి, ఏలాగైనా, తనయింట దీపం నిలుపుకోవాలని, – కొంచెం గడుసరిగా అనుకుని – ఓ పన్నాగంలోకి దిగాడు.

అంతవరకూ చక్కని అనుకూల దాంపత్యం, చిలకాగోరింకలాగా చూడముచ్చట అయ్యేది ఉభయులనూ. ఒక్కసారిగా కటికకోరంటికంలోకి దిగి, ఆమెవంకన్నా చూడకుండా, కాల్చుకుతినడం ప్రారంభించాడు. కొంతకాలమైనా అలా అంటిముట్ట కుండా, పరాయిదానికన్నాకూడా కనాకష్టంగా చూస్తే – తన గుండెలు ఎంత కుమిలిపోయినా – తన భార్య బ్రతికి బాగుంటుంది కదా అని ఆ బ్రాహ్మణుడి ఆశ:

అది – ఆ చిన్నదానికి ఏం అర్థమౌతుంది? మొదటి రోజు కసిరి కరవవచ్చినట్టుగా మీదకువస్తే, చెంపకు చారెడు కళ్ళుచేసుకుని బెదిరిపోయినా, అప్పటి కేలాగో – ఏదో చిరాకుగా వుండి అలా మండిపడుతున్నాడని – సమాధానపరచుకుని ఊరుకుంది; కాని, రోజూ ఎప్పటికప్పుడు అదే తంతు అయేటప్పటికి బెంగతో, హడలిపోయి మంచం ఎక్కింది.

అక్కడితోనైనా, కళ్ళు తెరచి, రామన్న పిచ్చ వేషం వేయకుండావుంటే బాగుండిపోనేమో? ఏంచేశాడనుకున్నావు? ఆ ఉపశాంతికి గ్రహచారం లొంగకపోగా, నెత్తి అణచడానికి కూర్చున్నట్టుంది. అందుకనే, నిక్షేపంలాంటిది అలా లోజెడిపోతూన్నది. ఇక తామసించకూడదు, అని నడుం కట్టుకుని – లోతుగా మునిగాడు.

అవును మరి, ఇక ఊరుకుంటాడా? పరమేశ్వరుడి మీద భారం వేసి, పదిరోజులు ఉద్దుకుడుచుకుని, చివరకు సాహసించి, పళ్ళబిగివిని, ఏలాగైతేనేం, పనిచేసే మంగాయ్ అని వుందిలే – ఆనక చూపిస్తానుండు–దానిమీద చేయివేసాడు. అవును అంతకన్న ఎక్కడికి వెతుక్కుంటూపోతాడు? అలాటి కార్యకలాపాలనికి మార్పేదో పడమర ఏదో అదివర కెన్నడయినా ఎరుగున్న పాపాన పోయివుంటేనా? అందుబాటులో వున్నది –– అది వాడి పూర్వసుకృతంకొద్దీ – అందింది.

ఇక పీడ వదలిపోయిందికదా అని ఎగిరి గంతులు వేశాడంటే నమ్ము.

మూడునాళ్ళ పట్టపగలు – ఏలాగో మొక్కు తీర్చుకుని బయటపడ్డాడనుకో, అసలు రెపరెప అంతా అందుకు కాదుగా – మంచిరోజు చూసి – మళ్ళా యింట్లో మంచం దులిపాడు.

ఒకరోజు, రెండురోజులు – ఆ అమ్మాయి ఏమాత్రమూ తేరుకోకపోవడం అలా ఉండగా, మరీ, కారు కమ్ముకుని, దిగనాసిల్లిపోయింది. అప్పటికైనా మేలుకున్నాడా! తగిన ఉపశాంతి జరిగింది కదా – అనేధైర్యంతో దానంతట అదే, భారకంతగ్గి లేచి తిరుగుతుందని – జబ్బు ఒకటైతే –వైద్యం ఒకటిగా లంకణాలుకట్టి మాడ్చి చివరకు, అత్తవారికి కబురుచేశాడు.

మామగారు వచ్చీరావడంతోనే వైద్యుణ్ణి పిలుచుకువచ్చి చూపించాడు. అతడు ఆయనను చాటుకుతోసుకు వెళ్ళి, ఏం చెప్పాడో! ఆయన, రామన్నతో మళ్ళా పలువిప్పకుండా, తన భార్యచేత చెప్పించి, ఇక అక్కడ గంగ ముట్టకుండా, ఆ పూటే కూతురిని, తన ఊరు తీసుకువెళ్ళిపోయినాడు.

––వారంరోజులు అయినా, అక్కడనుంచీ ఏ కబురూలేదు. మనసుపట్టలేక, రామన్న తానుకూడా రైలు ఎక్కాడు. గుమ్మంలో అడుగువేసేటప్పటికి ఏలాగు

ఉన్నదిటాస్థితి - ఇల్లంతా అలగలు బాలగోలు. అప్పుడో కాస్సేపో --

అంత గంగిగోగోవులాంటి సాధువు - అమాంతం ఆ మామగారి మీద విరుచుకుపడ్డాడు, 'అంత ముంచుకువచ్చినా తనకు కబురెందుకు చేయలే'దని. ఆయన ఉగ్రుడైపోయి, 'చేసిన నిర్వాహకం చాలక ఏ ముఖం పెట్టుకు నా గడప త్రొక్కుతావని కబురుచేస్తాను?' అనగానే, రామన్న సగం చచ్చి, గుడ్లనీరు కుక్కుకుంటూ, - భార్య మంచం దగ్గిరకు వెళ్ళాడు. చుట్టూ ఎవరెవరో కూర్చుని ఉన్నారు. ఎవరూ వైదొలగి అతన్ని దగ్గిరకు వెళ్ళనీయలేదు. అంత దూరంగా అలా నిలుచున్నాడు.

--తల్లివంక చూస్తున్నది అంతసేపూ -- అలికిడికి కాబోలు నెమ్మదిగా మెడ అతడు ఉన్నవేపు తిప్పి - పెనిమిటి కంటపడగానే - అంత నీరసంలోనూ మెడవిరుగుతుందేమో అన్నంత దుడుకుగా తల విసిరిత్రిప్పుకొని - విపరీతంగా మూలిగింది. అందరూ, అతనివేపు తిరిగి - బాకులలాటి చూపులతో గ్రుచ్చి గ్రుచ్చి అక్కడనుంచి తరిమేశారు.

--రామన్న వచ్చేసిన తరువాత ఒక గంట మాత్రం ఆమెకు ఊపిరి ఉన్నదట-

అంతటితో పోయిందనుకున్నావా? ఆ వరసవరుస- రామన్న మూడు నెలలు ఆస్పత్రిలో ఉండి -- మళ్ళా తల్లి కడుపున పుట్టాడనుకో: అతడి పాపం-కొంచెం ఆలస్యంగా ఫలించింది-అప్పట్లో రాలిపోయినా-అదృష్టవంతుడే.

--ఒకరిని ఓ మాట అనడు పలుకడు. ఎప్పుడూ ఒకటే ధోరణి 'గ్రహబలం': అలా అనుకోవడమే ఆ వెర్రికి బలం. అసలుసంగతే గ్రహించే మతి ఉంటేనా - అసలు గుండెలాడేవా?

ఇప్పుడు ఇదోమాదిరి - ఏ పత్రికో చదివి - పంచాంగం చూశో - నెలవారీ, రోజువారీ ఫలితాలు కట్టుకోవడం -- అది యింటింటా చెప్పిరావడం : విన్నావుకదూ 'శత్రునాశనం' అట. శత్రువు ఎవరో తెలుసునా, ఆ...కొడుకన్నాడు? -- మామగారు.

ఇదీ--కథ.

★ ★ ★